క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నాగలాపురం: పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ వారు తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద నేత్రాలయ ఆధ్వర్యంలో మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీ శంకర్, సీఈఓ సీతారామనాయుడు పర్యవేక్షణలో పట్టణంలోని సాయిబాబా మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యశిబిరంలో రోగులకు అనుభవం గల స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అందులో 60 మందికి మందులు, 40 మందికి ఉచితంగా కంటి అద్దాలు, 100 మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లు ట్రస్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఏఓ కృష్ణ, అరవింద్ నేత్రాలయ సిబ్బంది గౌరీ శంకర్ పాల్గొన్నారు, సాయిబాబా ఆలయ ప్రతినిధులు జగదీశ్ రెడ్డి, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటరమణ

సత్యవేడు: అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొల్లడం గ్రామానికి చెందిన వెంకటరమణ ఎంపికయ్యారు. ఆ సంఘం సభ్యులు ఆదివారం ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడతూ అబేడ్కర్ సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు.

వీధిదీపాలకు మరమ్మతులు

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరులో ఆదివారం సర్పంచ్ కందాటి మోహనప్రియ ఆధ్వర్యంలో వీధిదీపాల మరమ్మతులు చేశారు. గ్రామంలో పలు చోట్ల వీధిదీపాలు వెలగకపోవటంతో సిబ్బంది సాయంతో వీధి లైట్లను మరమ్మతులు చేశారు.



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



క్షతగాత్రుడి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న బియ్యపు మధుసూదన్ రెడ్డి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): శ్రీకాళహస్తి మండలం అమ్మ పాలెంకు చెందిన మధుసూదన్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడి అమర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆదివారం సాయంత్రం అమర ఆస్పత్రికి చేరుకొని వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వారి బంధువులను పరామర్శించారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ సిద్ధగుంట సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచులు బాబ్జిరెడ్డి, మునిశేఖర్ రెడ్డి, నగేషం, కో ఆప్షన్ సభ్యులు హసన్ సాహెబ్, వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనారిటీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రసూల్, సుబ్బారెడ్డి, బాబురావు ఉన్నారు.

బీజేపీ ర్యాలీతో అగచాట్లు



ర్యాలీ సందర్భంగా ఏర్పడిన ట్రాఫిక్

శ్రీకాళహస్తి: పట్టణ పరిధిలో బీజేపీ ఆవిర్భావం సందర్భంగా నిర్వహించిన ర్యాలీతో ట్రాఫిక్‌తో అంతరాయం ఏర్పడింది. ఒకవైపు నెహ్రూవీధిలో శ్రీరామ నవమి సందర్భంగా భక్తులు వెళ్లడానికి లేకుండా స్టేజీ ఏర్పాటు చేయంతో ఆ రోడ్డు పూర్తిగా బ్లాక్ అయింది. బీజేపీ ఆవిర్భావ దినోత్సవ ర్యాలీ సందర్భంగా భేరివారి మండపం నుంచి ఆలయం, కృష్ణారెడ్డి మండపం మీదుగా స్వర్ణముఖి నది వంతెన వరకు ర్యాలీ నిర్వహించారు. దీంతో పూర్తిగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఆలయ అధికారులు స్టేజీ నిర్మాణంలో పాదచారులకు అవకాశం కల్పించలేదు. ర్యాలీని పోలీసులు సరిగ్గా అదుపు చేయకపోవంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



శ్రీకాళహస్తి: ప్రత్యేక ఆకర్షణగా అయోధ్య సీతారాములు, సారె తీసుకువస్తున్న ఈవో బాపిరెడ్డి తదితరులు, ముత్యాల తలంబ్రాలు







స్వామి అమ్మవార్ల పట్టువస్త్రాలు



జీలకర్ర బెల్లం



నయనానందకరం సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు



ప్రత్యేక అలంకారంలో సీతారాములు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని నెహ్రూవీధిలో ఉన్న శ్రీపట్టాభి రామమందిరంలో సీతారాముల కల్యాణం ఆదివారం నయనానందకరంగా సాగింది. శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆలయంలో విశ్వావసు నామ సంవత్సరం చైత్రశుద్ధ నవమి అభిజిత్ శుభ ముహూర్తాన సీతారాముల కల్యాణం అత్యంత వేడుకగా నిర్వహించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా రామ కల్యాణాన్ని నిర్వహించారు. వరదరాజ స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనుల సందర్భంగా రామాలయం ఎదురుగా గల రోడ్డుపై బహిరంగ వేదిక ఏర్పాటు చేశారు. మొదట స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కల్యాణఘట్టం చూడటానికి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. వేదపండితులు తలంబ్రాలను స్వామి అమ్మవార్లకు పోసి పూలమాలలు వేసి కల్యాణ ఘట్టాన్ని కళ్లకు కట్టేలా చేశారు. వచ్చిన భక్తులందరికీ ఆలయం తరపున ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం విశేష నైవేద్యం, మంత్రపుష్పం, దీపారాధన, హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఈవో బాపిరెడ్డి, చెంచయ్యనాయుడు, కోలా ఆనంద్, కోట వినుత పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామనవమి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో శ్రీరామనవమి పండుగ వేడుకలను ఆదివారం మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరాముని ఆలయాల్లో పూజలు చేసి పానకం, వడపప్పు ప్రసాదాలను పంపిణీ చేశారు. మండలంలోని పల్లమాల గ్రామంలో శ్రీఅభయ ఆంజనేయస్వామి దేవాలయంలోని శ్రీరాముడు, సీతమ్మ, లక్ష్మణుడు విగ్రహాలకు అభిషేకాలు చేసి, పూలతో అలంకరించారు. గాజులపెళ్లూరులోని సీతారాముల ఆలయంలో, నీర్వాకోట, కాటూరు గ్రామాల్లోని రామాలయాల్లోని శ్రీసీతారాముల పటాలను పూలతో అలంకరించి, పూజలు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. బుచ్చినాయుడుకండ్రిగలో భక్తులు పానకం, మజ్జిగ, అరటిపండ్లు, బూందీ స్వీట్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: శ్రీరామనవమి సందర్భంగా గ్రామాల్లోని సీతారాములవారు, అంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద పాండూరు శ్రీసీతా సమేత శ్రీకోదండరామ స్వామి ఆలయం, వరదయ్యపాళెంలోని శ్రీవీరభద్ర స్వామి ఆలయం, హీరో పరిశ్రమ సమీపంలోని శ్రీసీతారామాలయంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం పాండూరు కోదండరామస్వామి ఆలయంలోని ధ్వజస్తంభానికి ధ్వజారోహణ పూజలతో మూడు రోజులపాటు జరగనున్న ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉదయం సీతారామస్వామికి అభిషేకం చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. ఆలయంలో రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నిరంజనాచార్యులు పూజ కార్యక్రమాలు చేపట్టారు. విశ్రాంత ఆర్‌అండ్‌బీ ఇంజినీర్ పరంధామ రెడ్డి తనయుడు శ్రీనురెడ్డి ఆలయంలో ఏర్పాట్లు చేశారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

హీరో పరిశ్రమ సమీపంలోని మాదనపాళెంకు చెందిన సీతారామ కోదండరామాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం సాయంత్రం స్వామి, అమ్మవార్ల కల్యాణం అశేష భక్తజన వాహిని నడుమ ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

వేడుకగా శ్రీరామనవమి

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో వెలసిన సీతారామాంజనేయ స్వామి ఆలయంలో స్వామి,అమ్మవార్ల కల్యాణోత్సవం వేడుకగా నిర్వహించారు. సీతారాములను విశేషంగా అలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణోత్సవం చేశారు. ఏర్పేడు, బండారుపల్లి, అంజిమేడు, పల్లం, మర్రిమంద, వికృతమాల గ్రామాలలో శ్రీరామ ఆలయాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

నారాయణవనంలో..

నారాయణవనం: మండలంలోని శ్రీపద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు వాడవాడలా శ్రీరామ నవమి పండుగను ఆదివారం వేడుకగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాత సేవతో నిత్యపూజా కైంకర్యాలను పూర్తి చేసి, పంగుణోత్తర ఉత్సవాల్లో భాగంగా పద్మావతీ అమ్మవారికి సర్కారు అభిషేకం పూర్తి చేశారు. అనంతరం శ్రీరామనమిని పురస్కరించుకుని శ్రీసీతాలక్ష్మణ సమేత రామచంద్రమూర్తికి స్నపన తిరుమంజనం నిర్వహించి దూపదీప నైవేద్యాలను సమర్పించారు. శ్రీరామనవమి సందర్భంగా పద్మావతీ అమ్మవారి ఊంజల్‌సేవను రద్దు చేసి ఆస్థానం నిర్వహించారు. శ్రీవీరరాఘవ స్వామి దేవస్థానంలో ఉదయం సామూహికంగా శ్రీరామ నవమి ఉత్సవాన్ని చేపట్టారు. 11 రోజులపాటు నిర్వహించే ఉత్సవాలకు అర్చకులు అంకురార్పణ చేశారు. ఉత్సవాలలో చివరి నాలుగు రోజుల పాటు కల్యాణం, వనవాసం, పట్టాభిషేకం, వడాక్షి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కమనీయం సీతారాముల కల్యాణం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): శ్రీరామనవమి పర్వదినాన రేణిగుంట మండలంలోని వాడవాడల శ్రీరామనవమి మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ప్రధానంగా గుత్తివారిపల్లె శ్రీ కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను కల్యాణ వేదిక పైకి తీసుకువచ్చి పుష్పాలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. గ్రామంలో ఉభయదారులు పెద్ద ఎత్తున కల్యాణానికి సారె తీసుకు వచ్చి సమర్పించారు. అనంతరం వేద పండితులు శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. భక్తులకు విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు భక్తులు పాల్గొన్నారు. రేణిగుంటలోని రామాలయాలు, రామకష్ణాపురంలోని శ్రీ సీతారాముల ఆలయంలో శ్రీరామనవమి ప్రత్యేక పూజలు చేశారు.

రామయ్య సేవలో ఎమ్మెల్యే

వరదయ్యపాళెం: పాండూరులోని శ్రీమేత కోదండ రామస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో ఆదివారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త, విశ్రాంత ఆర్‌అండ్‌బీ సీఈ పరంధామ రెడ్డి ఆయనకు స్వాగతం పలికి స్వామి, వార్ల దర్శనం చేయించారు. ఆలయ అర్చకుడురంజనాచార్యులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలను అందజేశారు.

వైభవంగా మహాకుంభాభిషేకం

శ్రీకాళహస్తి: శ్రీరామనవమి సందర్భంగా శ్రీకాళహస్తి కొత్తపేట గాండ్లవీధి, గాండ్ల సంక్షేమ సంఘం నూతనంగా నిర్మించిన శ్రీ సీతా సమేత శ్రీరామచంద్రస్వామి వారి దేవాలయంలో మహాకుంభాభిషేక మహోత్సవం నిర్వహించారు. దీనికి శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మరియు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. శ్రీ సీతా సమేత శ్రీరామచంద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బాల్‌శెట్టి విజయ్ శేఖర్, రాజేంద్ర, సురేష్, దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు సాధన మున్న రాయల్, మాజీ కౌన్సిలర్ ఉత్తరాజి శరవణ కుమార్, కంట ఉదయ్ కుమార్, లీలావతి, నియోజవర్గ యువత అధ్యక్షులు శ్రీవారి సురేష్, షేక్ సిరాజ్ భాష, పులి రామచంద్రయ్య, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి జయక్రిష్ణా రెడ్డి, సుధాకర్, పటాన్ ఫరీద్, పీఎం చంద్ర, వెంకటేశ్వర్లు, పెరుమాళ్, జూమ్లేష, జీవీకె రెడ్డి, నియోజకవర్గం ఎస్సీసెల్ అధ్యక్షులు పసల కృష్ణయ్య, రవితేజ, గిరీష్ కుమార్, తరుణ్, హరికష్ణ, భరత్ పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తదితరులు

స్వామివారి సేవలో ఎమ్మెల్సీ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం గుత్తివారిపల్లెలోని శ్రీ కోదండ రామాలయం జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన రెడ్డి, వైఎస్సార్‌సీపీ తిరుపతి పట్టణ అధ్యక్షుడు మల్లం రవిచంద్ర రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు తిరుమల రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు అతిథులను ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆశీర్వదించి ఆలయ సంప్రదాయం ప్రకారం సత్కరించి తీర్థప్రసాదాలను అందించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముందుగా రాష్ట్ర ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. హిందువులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొని సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వీక్షించడం ఆనందంగా ఉందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో 115 ఆలయాలను నిర్మించామన్నారు. 40 ఏళ్ల చరిత్రలో నియోజకవర్గంలో అన్ని ఆలయాలు నిర్మించిన ఘనత తనకే దక్కిందని అన్నారు. స్వామివారి దయతో అంతటి పుణ్యకార్యాన్ని నిర్వహించామని పేర్కొన్నారు. సీతారాముల ఆశీస్సులు నియోజకవర్గంలోని ప్రజలందరి మీద ఉండాలని కోరారు.



సీతారాముల సేవలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం



మాజీ ఎమ్మెల్యేను సత్కరిస్తున్న అర్చకులు











బుచ్చినాయుడుకండ్రిగలో పూజలు, పాండూరులో ప్రత్యేక అలంకరణలో సీతారాములు, స్వామి సేవలో వైఎస్సార్‌సీపీ నేతలు, పాపానాయుడుపేటలో సీతారాముల కల్యాణోత్సవం, గుత్తివారిపల్లె శ్రీ కోదండ రామాలయంలో కల్యాణోత్సవం చేస్తున్న వేద పండితులు

పెద్దిరెడ్డిని కలసిన కేవీబీపురం నేతలు



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో నూకతోటి రాజేష్, కేవీబీపురం నాయకులు

వరదయ్యపాళెం: నియోజకవర్గంలోని కేవీబీపురం మండల వైఎస్ఆర్ సీపీ నాయకులు ఆదివారం తిరుపతిలోని మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఇటీవల పెద్దిరెడ్డి చేతికి గాయమై చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటుండడంతో సమాచారం తెలుసుకున్న కేవీబీపురం నాయకులు, సత్యవేడు నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌తోపాటు పెద్దిరెడ్డిని కలసి ఆరోగ్య యోగక్షేమాలు తెలుసుకున్నారు. కలిసిన వారిలో కేవీబీపురం మండల ఎంపీపీ భర్త నందగోపాల్, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, ఆదరం ఎంపీటీసీ పరశురాం, మాజీ జెడ్పీటీసీ డేవిడ్, నాయకులు వెంకటేష్, మురళీ రెడ్డి, యశ్వంత్, భూపతి ఉన్నారు.

వైభవంగా ధుని మండపం వార్షికోత్సవం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంటలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో ధుని మండపం వార్షికోత్సవం శ్రీరామనవమి మహోత్సవాలు వైభవోపేతంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారు జామున సాయిబాబా విగ్రహానికి విశేష అభిషేకాలు చేసి, మందిరాన్ని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో సీతారాముల ఉత్సవ మూర్తులను కల్యాణ మండపానికి వేంచేపు చేసిన వేద పండితులు కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీక్షించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న మహిళలకు పసుపు దారాలు, పసుపు కుంకుమను పంపిణీ చేశారు. అనంతరం షిరిడీ సాయి సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో సుమారు 1000 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉట్ల మహోత్సవంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రాత్రి 7 గంటలకు పట్టణ వీధుల్లో చందన జెండా ఉత్సవాన్ని నిర్వహించారు.



ధుని మండపంలో పూజలు చేస్తున్న మహిళలు

ఇంట్లో చోరీ

వరదయ్యపాళెం : మండలంలోని యానాదివెట్టులోని ఓ ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన జి.నిచిత ఊరెళ్లారు. ఇది గమనించిన దుండగులు అర్ధరాత్రి ఇంట్లోకి ప్రవేశించి బీరువాను పగులగొట్టి 2 కిలోల వెండి ఆభరణాలు, రూ.80వేల నగదు, ఒక ల్యాప్‌ట్యాప్‌ను చోరీ చేశారు. ఆదివారం తిరిగివచ్చిన నిచిత ఇంట్లో చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ మల్లికార్జున క్లూస్‌టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రూ.10 లక్షల ఆస్తి నష్టం

తిరుపతి రూరల్: నగరంలోని అలిపిరి సెక్షన్ పరిధిలో గల 132 కేవీ రుయా హాస్పిటల్ అండర్ గ్రౌండ్ కేబుల్స్‌కు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో 3 కేబుల్స్ కాలిపోయాయి. దీంతో విద్యుత్ శాఖకు రూ.10 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని ఎస్‌ఈ సురేంద్ర నాయుడు తెలిపారు.

గుడిమల్లంలో సీఐడీ డీజీపీ



గుడిమల్లం ఆలయంలో సీఐడీ డీజీపీ రవిశంకర్ అయ్యర్

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం గుడిమల్లం పరశురామేశ్వరాలయాన్ని ఆదివారం రాష్ట్ర సీఐడీ డీజీపీ రవిశంకర్ అయ్యర్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో రామచంద్రారెడ్డి, మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించి శేషవస్త్రాలతో ఘనంగా సత్కరించి స్వామి, అమ్మవార్ల తీర్థప్రసాదాలను అందజేశారు.

తానా పురస్కార గ్రహీతలకు సత్కారం

తిరుపతి కల్చరల్: తానా, మంచి పుస్తకం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల నవలల పోటీల్లో ఇటీవల తానా పురస్కారాలు అందుకున్న రచయితలు ఆర్‌సీ కృష్ణస్వామి రాజు, పేట యుగంధర్‌ను సాహితీ వేత్తలు, రచయితలు ఆదివారం ఓ ప్రైవేటు హోటల్లో ఘనంగా సత్కరించి అభినందించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా చరిత్రలోనే బాలసాహిత్యంలో తానా బాలసాహిత్యం అవార్డు రావడం , ఇందులో ఇద్దరి రచయితలకు ఒకేసారి రావడం గర్వించదగ్గ విషయమని సాహితీమిత్రులు కొనియాడారు. వీరి నుంచి భవిషత్‌లో మరిన్ని మంచి బాల సాహితీ రచనలు రావాలని ఆకాంక్షించారు. సత్కరించిన వారిలో రచయితలు పల్లిపట్టు నాగరాజు, కేవీ మేఘనాథ్‌రెడ్డి, మాణిక్యం, సాహితీ మిత్రులు ఉన్నారు.



తానా పురస్కారాల గ్రహీతలను సత్కరిస్తున్న రచయితలు, సాహితీ మిత్రులు

నిత్యావసర సరుకుల వితరణ

తిరుపతి కల్చరల్: టీటీడీ క్షత్రియ ఉద్యోగుల సంఘం, తిరుపతిలోని రాజు క్షత్రియులు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తూకివాకంలోని ఆశ్రమ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వారు వృద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతుల కేంద్రానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, బిస్కెట్లు, పండ్లు వితరణ చేశారు. ఆశ్రమ నిర్వాహకురాలు శోభారాణి, రమేష్, శంకర్‌రెడ్డి, గౌతమ్, గోవర్ధనరాజు పాల్గొన్నారు.